క్లుప్తంగా

హెల్త్ సెంటర్ పరిశీలన



బీపీ పరీక్ష చేయించుకుంటున్న వీసీ

తిరుపతి సిటీ: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య తాతా నరసింగరావు మంగళవారం సాయంత్రం విశ్వవిద్యాలయ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కేంద్ర పనితీరుపై ఆరా తీశారు. తాను కొన్ని పరీక్షలు చేయించుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. మందులను కూడా పరిశీలించారు. అంతకుముందు రోజు మధ్యాహ్నం మెన్స్ హాస్టల్ భోజనశాలను పరిశీలించారు. అక్కడే విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

కార్పెంటర్‌కు ఆర్థిక సాయం



మహ్మద్‌బాషాకు ఆర్థిక సాయం చేస్తున్న సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: ప్రమాదవశాత్తు కాలు విరిగి చికిత్స పొందుతున్న కార్పెంటర్ మహ్మద్ బాషాకు తిరుపతి కార్పెంటర్ల సంక్షేమ సంఘం మంగళవారం రూ.15 వేలు ఆర్థిక సాయం చేసింది. సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీ.రత్నం ఆచారి, ఎలిగారం కృపాచారి, కోశాధికారి జి.దేవరాజు పాల్గొన్నారు.

అనధికార నిర్మాణాలను అడ్డుకున్న ప్లానింగ్ సిబ్బంది



అధికారులు తొలగించిన అనధికార నిర్మాణాలు

తిరుపతి తుడా: నగరపాలక సంస్థ పరిధిలోని మధురానగర్‌లో అనధికారిక అదనపు నిర్మాణాలను మంగళవారం పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు, సిబ్బంది అడ్డుకున్నారు. కమిషనర్ ఎన్.మౌర్య ఆదేశాల మేరకు ఆ పనులను అడ్డుకుని పరిశీలించినట్టు డీసీపీ ఖాన్ తెలిపారు. అక్కడ జరుగుతున్న అదనపు నిర్మాణలకు ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సెంట్రింగ్ వర్క్ తొలగించినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఏసీపీ మూర్తి, టీపీఓ వంశీ, టీపీబీఓ సంతోష్, ప్లానింగ్ సెక్రటరీలు అక్బర్, మునీంద్ర పాల్గొన్నారు.


19న 'నీ గానమే.. నా ప్రాణం'

చంద్రగిరి: మండలంలో ఐతేపల్లెలోని జీఆర్‌కే కల్యాణ మండపంలో 19వ తేదీ 6 గంటలకు 'నీ గానమే నా ప్రాణం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తిరుపతి జిల్లా అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార సమితి జిల్లా సెక్రటరీ, గురుస్వామి మోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 నుంచి రాత్రి 8 గంటలకు నిర్వహించే కార్యక్రమాలను తెలియజేశారు. అఖండ భజనకు అయ్యప్ప భక్తులు, భజన బృందాలు, గాయకులు విచ్చేసి జయప్రదం చేయాలని కోరారు.

16న ఉద్యోగ మేళా

శ్రీకాళహస్తి : పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జవహర్ నాలెడ్జ్ సెంటర్, లక్ష సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ గురువారం ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ మేళాలో టెక్ మహేంద్ర, పైసా బజార్, కాల్మన్, బీపీవో కన్వర్జెన్స్, టాటా ఎలక్ట్రానిక్స్ తదితర కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఈ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత అయిన యువత అర్హులన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు తమ వెంట ఆధార్ జిరాక్స్, అకడమిక్ సర్టిఫికెట్స్, రెజ్యూమ్ వెంట తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 9703683455, 6300471661, 9494801211 నంబర్లలో సంప్రదించాలన్నారు.

మత్తు.. ముంచేస్తోంది!



వరదయ్యపాళెం : ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి చిన్న పాండూరు సమీపంలోని ఏపీ ఐఐసీ సెజ్ పరిధిలోని ఓ ప్రైవేటు పరిశ్రమలో పని చేసే కార్మికుడు. ఆయన అపోలో పరిశ్రమకు వెళ్లే రోడ్డు మార్గానికి పక్కనే మంగళవారం సాయంత్రం మద్యం తాగి తులి తూగుతున్నాడు. ఒళ్లు తెలియని మైకంలో రోడ్డు పక్కనే చెట్ల పొదల మధ్యలో పడి మత్తులో ఉన్నాడు. ప్రధానంగా అపోలో పరిశ్రమకు వెళ్లే మార్గంలోనే మద్యం దుకాణం ఉండడం పలువురు మత్తుకు బానిసవుతున్నారని స్థానికులు చెబుతున్నారు.

కాస్త పట్టించుకోండయ్యా..!



అయ్యోపాపం..
ఈ రోగికి ఎన్ని కష్టాలో...

రాయలసీమకే తలమానికమైన రుయా ఆస్పత్రికి సాధారణంగా రోగుల తాకిడి ఎక్కువ. ఇక సోమవారమైతే చెప్పక్కర్లేదు. వైద్య కోసం రాష్ట్రం, జిల్లాలోని వివిధ ప్రాంతాల వస్తుంటారు. ఓపీ బ్లాక్, వైద్య పరీక్షల కోసం బారులు తీరిన జనాలతో కిక్కిరిసింది. ఓపీ తీసుకునేందుకు గంటల తరబడి క్యూలలో వేచి ఉండాల్సి రావడంతో రోగులు, వారి సహాయకులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు 7వ నెంబర్ ఓపీ కౌంటర్‌కు తాళాలు వేసేశారు. అధికారులు సరైన సౌకర్యాలు కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఫొటోలు:- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



ఓపీ బ్లాక్‌లో పడిగాపులు కాస్తున్న రోగులు, సహాయకులు



ఓపీల వద్ద బల్లలపై నిరీక్షిస్తున్న రోగులు



బల్లపై నిరీక్షిస్తున్న రోగులు



తాళం వేసి ఉన్న 7వ నంబర్ కౌంటర్ ఓపీ



ఇదెప్పుడు తెరుస్తారో..?

జాతీయ శిఖరాగ్ర సమావేశానికి తిరుపతి మేయర్



మేయర్ డాక్టర్ శిరీష (ఫైల్)

తిరుపతి తుడా: అహ్మదాబాద్‌లో ఈనెల 15,16వ తేదీలలో నిర్వహించనున్న జాతీయ మేయర్ల శిఖరాగ్ర సమావేశానికి హాజరు కావాలని తిరుపతి మేయర్ డాక్టర్ శిరీషకు అహ్మదాబాద్ నగరపాలక సంస్థ నుంచి ఆహ్వానం అందింది. 'నేషనల్ అర్బన్ కాన్‌క్లేవ్ అండ్ మేయర్ రోల్ సమ్మిట్ ఫర్ షేపింగ్ ద ఫ్యూచర్ సిటీ' అనే అంశంపై నిర్వహించే సదస్సుకు హాజరై శిరీష ప్రసంగిస్తారు. దేశంలో ఉన్న పురాతన నగరాలలో అహ్మదాబాద్ ఒకటి. భారత మాజీ ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా ఈ సదస్సు నిర్వహించనుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదే మున్సిపాలిటీకి 1924 నుంచి 1928 వరకు సర్దార్ వల్లభాయ్ పటేల్ అధ్యక్షులుగా పనిచేయడం విశేషం!

నల్లబ్యాడ్జీలతో నిరసన



నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది, సూపర్‌వైజర్లు

చంద్రగిరి: పీహెచ్‌సీల వైద్యుల డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట వైద్య సిబ్బంది, సూపర్‌వైజర్లు ఆందోళన చేశారు. భోజన విరామ సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏపీహెచ్‌ఏఎంఎస్‌ఏ మండల కార్యదర్శి వాసుదేవ రెడ్డి, శ్యామల మాట్లాడారు. వైద్యుల సమస్యలపై ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఎంపీహెచ్‌ఎస్, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

సురేంద్రనాయుడికి నివాళి



నివాళులర్పిస్తున్న ఎంపీపీ బ్రహ్మానంద రెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని కొత్తకండ్రిగకు చెందిన వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ మాజీ కన్వీనర్ సురేంద్ర నాయుడు రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతి చెందారు. మంగళవారం ఆయన భౌతిక కాయానికి మండల నాయకులు ఎంపీపీ బ్రహ్మానంద రెడ్డి, మాజీ ఎంపీపీ దామోదర్ రెడ్డి, పలువురు నేతలు నివాళులు అర్పించారు.



సిద్ధమ్మ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న చెవిరెడ్డి లక్ష్మి

చంద్రగిరిలో..

చంద్రగిరి: స్థానిక రెడ్డివీధికి చెందిన నారంగారి సిద్ధమ్మకు చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి నివాళులు అర్పించారు. మంగళవారం ఆకస్మికంగా మరణించిన ఆమె మృతదేహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

అంతర కళాశాలల మహిళా క్రీడలు ప్రారంభం



అంతర కళాశాలల ఉమెన్ గేమ్స్‌ను ప్రారంభిస్తున్న వీసీ నర్సింగరావు, అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించి వర్సిటీ అంతర కళాశాలల మహిళల క్రీడా పోటీలను వీసీ నర్సింగరావు మంగళవారం ప్రారంభించారు. వర్సిటీ పరిధిలోని 30కళాశాలల నుంచి సుమారు 300మంది క్రీడాకారిణులు హాజరయ్యారు. తొలిరోజు వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఖో-ఖో, బాల్ బ్యాడ్మింటన్, టెన్నిస్ పోటీలు నిర్వహించారు. బుధవారం ఇండోర్ గేమ్స్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తామని ఫిజికల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుధారాణి, క్రీడాకారులు, కోచ్‌లు పాల్గొన్నారు.

రజకుల ఆత్మీయ సత్కారం



శ్రీశైలం రజక అన్నదాన సత్రం చైర్మన్ సుబ్బారావును సత్కరిస్తున్న రజక సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: శ్రీశైలం రజక అన్నదాన సత్రం చైర్మన్ సుబ్బారావును మంగళవారం ఓ హోటల్లో రజక సంఘ నేతలు ఘనంగా సత్కరించారు. ఎస్‌బీఐ మేనేజర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన ఆయన పదేళ్లుగా శ్రీశైలం రజక అన్నదాన సత్రం అభివృద్ధికి, రజకుల అభ్యున్నతికి చేస్తున్న సేవలను పలువురు ప్రస్తుతించారు. అన్నదానం సత్రం ట్రస్ట్‌లో తిరుపతి జిల్లా నుంచి ఇద్దరికి అవకాశం కల్పిస్తానని సుబ్బారావు ప్రకటించారు. కార్యక్రమంలో ఏపీ రాష్ట్ర రజక జనసేవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కినపల్లి లక్ష్మయ్య, తిరుపతి రజక ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు గంధం బాబు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ కరాటి చంద్రం మునస్వామి, మునిరత్నం, మల్లెల నాగరాజు, అశోక్, చెంబుకూరి రాజయ్య, సుధాకర్, చాముండేశ్వరి పాల్గొన్నారు.

కాలువల ఆక్రమణ



నీరు వెళ్లే మార్గం లేక నిలిచిపోయిన దృశ్యం



రైతులు చంగల్ రాయులు, మోహన్

భాకరాపేట: చిన్నగొట్టిగల్లు మండలంలో కాలువలు, చెరువులు కబ్జాకు గురవుతున్నాయి.భాకరాపేట ప్రాంతం పరిసరాల్లో విలువైన స్థలాలపై కొందరు కన్నేసి, కాలువలను సైతం పూడ్చి ఆక్రమిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. ఆక్రమణల మూలాన కాలువలు మూసుకుపోవడంతో నీటి ప్రవాహం ఆగిపోయింది. కాలువలు పూడ్చి వేయడంతో తమ పొలంలో నీరు పారించలేకపోతున్నామని రైతులు చంగల్ రాయులు, మోహన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆక్రమణల నుంచి కాలువలకు విముక్తి కల్పించి పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

ప్రైవేట్ పీజీ హాస్టళ్లపై చర్యలు తీసుకోరూ!



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న హేమాద్రి యాదవ్ తదితరులు



కాలువలో వ్యర్థాలను తొలగించాలని సిబ్బందిని ఆదేశిస్తున్న కమిషనర్

-మున్సిపల్ కమిషనర్‌కు ఏపీ స్టూడెంట్స్ జేఏసీ వినతి

తిరుపతి తుడా: నగరంలో అనుమతులు లేకుండా పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేటు పీజీ హాస్టళ్లు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా నిలుస్తున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్టూడెంట్స్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు హేమాద్రి యాదవ్ మంగళవారం నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ, తిరుపతిలోని ప్రైవేట్ పీజీ హాస్టళ్ల నిర్వాహకులు విద్యార్థుల నుంచి నెలకు వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తూ వారికి కనీసం వసతులు కల్పించడం లేదని, హాస్టల్లో వంటగదులు చాలా అపరిశుభ్రంగా ఉన్నాయని నివేదించారు. హాస్టళ్లకు విద్యార్థులు మత్తుపానీయాలు తీసుకెళ్లి సేవిస్తున్నారని, మొన్నటికి మొన్న విద్యార్థి హాస్టల్లో మద్యం సేవించి అదే బిల్డింగ్ పైనుంచి ఆత్మహత్య చేసుకున్నాడని , ఈ నేపథ్యంలో తనిఖీలు చేసి నియంత్రించాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ దళిత సేన నేతలు సుధాకర్ మాదిగ, యుగంధర్, జేడీ ప్రసాద్, రాయలసీమ స్టూడెంట్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు జ్యోతి కుమార్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్, గిరిజన జన సమాజ్ నేత మహేంద్ర నాయక్ పాల్గొన్నారు.

కాలువల్లో వ్యర్థాలు లేకుండా శుభ్రం చేయండి

తిరుపతి తుడా: నగరంలోని మురుగు కాలువల్లో వ్యర్థాలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగించాలని కమిషనర్ ఎన్.మౌర్య నగరపాలక సంస్థ అధికారులను ఆదేశించారు. మంగళవారం నగరంలోని 44, 35 వార్డుల్లో పారిశుధ్య పనులను కార్పొరేటర్లు, అధికారులతో కలిసి ఆమె పరిశీలించి మాట్లాడారు. ఎక్కడైనా కాలువలు దెబ్బతిని ఉంటే వాటి మరమ్మతులకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సీపీఆర్ అపార్ట్‌మెంట్ పక్కన ఉన్న రోడ్డులో వాహనాలు వెళ్లేందుకు ఇబ్బందిగా ఉందని, విస్తరించాలని స్థానికులు కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలో నేటి కార్యక్రమాలు

- నెహ్రూనగర్‌లోని కార్పొరేషన్ ప్రైమరీ స్కూల్లో ఉదయం 9 గంటలకు పిల్లలకు ఉచిత వైద్య శిబిరం.
- పద్మావతిపురంలోని వైఎస్‌ఆర్‌సీపీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా సమన్వయకర్తల సమావేశం.
- తిరుపతిలోని టీటీడీ క్యాంటీన్ వద్దనున్న కొత్త జాబిలి భవనంలో విశ్రాంత ఉద్యోగులకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శ్రీవారి లడ్డూ, వడ ప్రసాదం పంపిణీ.
- శ్రీగోవిందరాజస్వామి ఆలయంలో ఉదయం 10 నుంచి శ్రీతిరుమలనంబి ఉత్సవాలు ప్రారంభం.
- సీఐటీయూ మహాసభలు ముగింపు నేపథ్యంలో యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు సీఐటీయూ నేతల మీడియా సమావేశం.

ముగిసిన పవిత్రోత్సవాలు



చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి : స్థానిక శ్రీ కోదండరామ స్వామివారి ఆలయ పవిత్రోత్సవాలు మంగళవారం మహా పూర్ణాహుతితో ఘనంగా ముగిశాయి. సాయంత్రం 5 గంటలకు సీతాసమేత కోదండరాముడు, లక్ష్మణుడి వీధి ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, సూపరింటెండెంట్ జ్ఞానప్రకాష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ముని హరి బాబు, ఆలయ అర్చకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పిడుగుపాటుతో గేదె మృతి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని కొత్తపాళెంలో మంగళవారం పిడుగు పడడంతో నాదమునిరెడ్డికి చెందిన గేదె మృతి చెందింది. పొలంలో మేత మేస్తుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడి పిడుగు గేదెపై పడింది. దీంతో గేదె అక్కడికక్కడే మృతి చెందింది. రూ. 50 వేలు విలువ చేసే పాడి గేదె మృతి చెందడంతో నాదమునిరెడ్డి లబోదిబోమని విలపించారు. ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని కోరారు.

జర్నలిస్టులు మరెన్నో విజయాలు సాధించాలి

–జర్నలిస్ట్ క్రికెట్ జట్టుకు కలెక్టర్ అభినందన



ఉమ్మడి జిల్లా జర్నలిస్ట్ క్రికెట్ క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: క్రీడారంగంలో జర్నలిస్టులు మరెన్నో విజయాలు సాధించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ ఆకాంక్షించారు. మంగళవారం తన కార్యాలయంలో జిల్లా జర్నలిస్ట్ క్రికెట్ టీమ్‌ను కలెక్టర్ అభినందించి మాట్లాడారు. అనంతపురంలో ఇటీవలే నిర్వహించిన జర్నలిస్ట్ ప్రీమియర్ లీగ్–2025 టోర్నీలో తిరుపతి, చిత్తూరు ఉమ్మడి జిల్లా జట్టు చాంపియన్‌గా నిలిచింది. ఈ నేపథ్యంలో కలెక్టర్ అభినందించారు. జర్నలిస్టులకు మరింత ప్రోత్సాహన్నిస్తామన్నారు. కార్యక్రమంలో జేశాప్ జిల్లా అధ్యక్షుడు విజయ యాదవ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, ఉపాధ్యక్షుడు పోతపోలు సుబ్రమణ్యం, కోశాధికారి నరేష్‌రెడ్డి, కెప్టెన్ పి.శ్రీనివాసులు, క్రీడాకారులు కామేశ్వరయ్య, చిన్నబాబు, వెంకటేష్, మనోహర్, జగదీష్, సుబ్రహ్మణ్యం, సురేష్, ప్రతాప్, నరేష్, మది అలగన్, మునిశేఖర్, సతీష్, శ్రీనివాసులు, సాయి తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపును ప్రజలకు చాటిచెప్పండి



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ అమరయ్య

తిరుపతి తుడా: సూపర్ జీఎస్టీ 2.0 తగ్గింపు వలన కలిగే ప్రయోజనాలను ప్రజలకు చాటిచెప్పాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య ఆదేశించారు. ఇదే అంశంపై మంగళవారం నగరపాలక సంస్థ, సీఎస్‌టీ అధికారులకు సమావేశం ఏర్పాటు చేసి ఆయన మాట్లాడారు. తగ్గించిన జీఎస్టీపై ఇప్పటికే పలు రకాలుగా ప్రచారం చేశామని, దీపావళి వరకు ఈ కార్యక్రమాలు ముమ్మరంగా చేయాలన్నారు. సమావేశంలో జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ వరలక్ష్మి, డిప్యూటీ సిటీ ప్లానర్ ఏసీపీ మూర్తి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మహిళలతోనే ఆర్థిక ప్రగతి



మాట్లాడుతున్న రాస్ పొదుపు సంఘాల పీడీ నాగరాజు

ఏర్పేడు : మహిళలతోనే కుటుంబ ఆర్థిక ప్రగతి పురోభివృద్ధి దిశగా పయనిస్తుందని రాస్ పొదుపు సంఘాల ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజు అన్నారు. మండలంలోని పాపానాయుడుపేటలోని రాస్ కార్యాలయంలో మంగళవారం సలహా మండలి సమావేశం నిర్వహించారు. మండలంలో కొన్ని దశాబ్దాలుగా రాస్ ద్వారా మహిళలు, రైతులకు ఆర్థిక స్వావలంబనకు కృషి జరుగుతోందన్నారు. మహిళలు స్వయం సమృద్ధి మార్గాలను ఎంచుకుని తీసుకున్న రుణాలతో కుటుంబ పురోభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా నిర్వహించుకోవాలన్నారు. రాస్ అధికారులు బాలాజీ రెడ్డి, రవి, మునీంద్ర, పార్థసారథి, సురేష్, రాస్ సిబ్బంది, లీడర్లు పాల్గొన్నారు.